

మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



భయ్ భంజనా వందనా సున్ హమారీ

దరస్ తేరే మాంగే యే తేరా పూజారీ

కాస్త లయ జ్ఞానం ఉంటే, కొన్ని పదాలు తెలిసి వుంటే బాణీలో ఒదిగే పాటలను ఎవరైనా రాయవచ్చు. కానీ పాట బాణీని స్వంతం చేసుకోవటమే కాదు, సినిమా సందర్భాన్ని మరపురానిదిగా చేస్తూ, పాట బాణీకి లయలు, హొయల పరిమళాలు అద్దుతూ పాటను హిమాలయ శిఖరంపై నుంచి భగవంతుడికి నీరాజనం అర్పించే అమరగీతంలా నిలపగలగటం ఒక్క శైలేంద్రకే సాధ్యం.

హిందీ సినీ సంగీత ప్రపంచంలో శైలేంద్రది ప్రత్యేకమైన స్థానం. సినిమా మొత్తం కథను పాట పల్లవిలో కుదించి ప్రదర్శించగల ప్రజ్ఞ అది. సందర్భోచితంగా భావాలు వ్యక్తపరుస్తు, ఆ భావాలకు సార్వజనీనతను ఆపాదించగల ప్రతిభ అతనిది. హిందీ సినీ సంగీత రంగంలో అత్యుత్తమ గేయ రచయితలుగా సాహిర్, మజ్రూహ్‌ల సరసన సగర్వంగా నిలవటమే కాదు తనకంటూ ప్రత్యేకమైన రచనా సంవిధానాన్ని రూపొందించుకున్న గేయ రచయిత శైలేంద్ర. ఎలాగయితే, శంకర్ జైకిషన్ తరువాత సినీ రంగ ప్రవేశం చేసిన సంగీత దర్శకులంతా శంకర్ జైకిశన్ ప్రభావం పడినవారో, అలాగే శైలేంద్ర తరువాత రంగప్రవేశం చేసిన సినీ గేయరచయితలంతా శైలేంద్ర ప్రభావం ఉన్నవారే. అందుకే శైలేంద్ర మరణం తరవాత గేయ రచన రంగంలో ఏర్పడిన లోటును పూడ్చేందుకు ఎంత ప్రయత్నించినా, ఎవరూ విజయం సాధించలేకపోయారు.

శంకర్ జైకిషన్ సంగీత భవంతిలో ఒక ప్రధాన ఆధార స్థంభం శైలేంద్ర. శైలేంద్ర, హస్రత్ జైపురి, శంకర్ - జై కిషన్‌లు కలసి హిందీ సినీ ప్రపంచంలో స్వర్ణయుగానికి 'బర్సాత్' సినిమాతో నాందీ ప్రస్తావన చేశారు. 1966లో శైలేంద్ర మరణించే వరకూ ఈ నలుగురూ కలసి స్వర్ణయుగాన్ని ఉచ్ఛస్థాయిలో నిలిపారు. శైలేంద్ర మరణం తరువాత శంకర్ జైకిషన్ సంగీత భవంతి బీటలు వారి కూలిపోవటమే కాదు, సినీ సంగీత స్వర్ణయుగం చరమ దశ ఆరంభమయింది కూడా!

'శంకర్ జై కిషన్' జంట సృజించిన సంగీతం ఎంతగా ప్రజాదరణ పొందుతూ వచ్చినా, పెద్దలు, పండితులు, వారి సంగీతాన్ని 'పాపులర్' సంగీతంగా కొట్టివేస్తూ, శాస్త్రీయ సంగీత ఆధారిత గీతాలను

సృజిస్తున్నాడని 'సంగీత దర్శకుడు నౌషాద్'కు పెద్ద పీట వేసేవారు. ఇది శంకర్ జై కిషన్‌కు తమ ప్రతిభను పెద్దలు శకిస్తున్నందుకు అవమానంగా తోచి ఆవేశం కలిగించింది. ఇది శంకర్ జైకిషన్, నౌషాద్‌ల నడుమ ప్రచ్ఛన్న 'పోటీ' వాతావరణాన్ని కల్పించింది. అలాంటి వారి ఆరోపణలన్నీ అపోహలని బసంత్ బహార్ సినిమా పాటల ద్వారా నిరూపించారు శంకర్ జైకిషన్ లు.

'బైజుబావరా' సినిమా సూపర్ హిట్ అయిన తరువాత భరత్ భూషన్, మళ్ళీ శాస్త్రీయ సంగీత విద్వాంసుడి వేషం వేస్తూన్న 'బసంత్ బహార్' సినిమాలో కూడా ముందుగా నౌషాద్‌ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేశారు. ఆ కాలంలో శంకర్ జై కిషన్ పట్టిందల్లా బంగారం అవుతూండటంతో డిస్ట్రిబ్యూటర్లు శంకర్ జైకిషన్ సంగీత దర్శకుడయితేనే పెట్టుబడి పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

అయితే సంగీత ఆధారిత సినిమా కాబట్టి, అంతగా శాస్త్రీయ సంగీత ఆధారిత గీతాలను శంకర్ జై కిషన్ రూపొంచించగలగటం పట్ల పలువురు అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తం చేశారు. దాంతో, ఈ సినిమా గీతాలను 'ఛాలెంజ్' చేసి మరీ రూపొందించారు శంకర్ జై కిషన్.

'బసంత్ బహార్' సినిమాలో ఒక్కో పాట ఒక్కో ఆణిముత్యం అనటం పాటల విలువను తక్కువ చేసినట్టవుతుంది. శాస్త్రీయ సంగీత ఆధారిత పాటలను ఇంత ఆకర్షణీయంగా, ఇంత జనరంజకంగా రూపొందిస్తూ కూడా పెద్దలను, పండితులను మెప్పించగలగటం సాధ్యమేనని శంకర్ జైకిషన్ ఈ సినిమా పాటలతో నిరూపించాడు.

'నైన్ మిలే చైన్ కహా', 'మై పియా తేరీ, తూమానే యా నమానే ', ' జా జారే జా బాలమ్ వా ' 'దునియా న భాయే మోహే ', 'బడి దేర్ భయీ ' 'సుర్ న సజే క్యా గావూ మై,' 'కర్ గయారే' వంటి పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ఈనాటికీ రోజూ మోగుతూంటాయి. అలాగే భీంసేన్ జోషి, మన్నాడేల 'కేతకీ గులాబ్ జూహి' పాట గురించి ఇప్పటికీ చర్చలు సాగుతున్నాయి. ఈ పాటలన్నిటినీ దాటి, ఈ సినిమాలోని పాటలన్నిటిలోకీ ఎప్పటికీ తలమానికంగా నిలుస్తుంది. 'భయ్ భంజనా' భజన.

సినిమాలో ఒక కీలకమైన సన్నివేశంలో వస్తుంది ఈ పాట. నాయకుడి సంగీత గానంపై రాజు ప్రతిబంధకం విధిస్తాడు. రాజు ఆజ్ఞాపించినప్పుడే పాట పాడాలి. నాయకుడు ఆ బాధలో ఉంటాడు. ఇంతలో పూజారి ఇచ్చిన పూలలో వెంట్రుక వచ్చిందని రాజు పూజారిని అవమానిస్తాడు. అమ్మవారి విగ్రహానికి వెంట్రుకలు లేనప్పుడు పూలలో వెంట్రుకలు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తాడు? ఆ సందర్భంలో తన పాటతో అమ్మవారి విగ్రహానికి వెంట్రుకలు మొలిపిస్తాడు హీరో. ఆ సందర్భంలో వస్తుంది ఈ పాట.

'బసంత్ బహార్' సినిమాలో హీరో దురదృష్టవంతుడు. గొప్ప ప్రతిభ ఉండి కూడా సరైన సమయంలో ప్రతిభ ప్రదర్శించలేక పోతూంటాడు. ధన సంపాదన లేనందుకు ఇంట్లో దూషణలు, బయట హేళనలు, వెక్కిరింపులు. వీటి నడుమ నలుగుతూంటాడు. ఇది హీరో పాత్రకు ఓ రకమైన దౌర్భల్యాన్ని, బలహీనతను ఆపాదిస్తుంది. అంటే ఆత్మవిశ్వాస రాహిత్యంతో సతమవుతూంటాడు. ప్రతిభ పట్ల విశ్వాసం ఉంది. అదృష్టంపై అనుమానం ఉంది .అందుకే పాటను 'భయ్ భంజనా ' అంటూ ఆరంభిస్తాడు.

భయాన్ని తొలిగిస్తుంది దేవి. అందుకే 'భయ్ భంజనా' అంటూ' ఆమెకు వందనం చేస్తూ దర్శనం అభ్యర్థిస్తున్నాడు. అతడు ఆమె భక్తుడు. భక్తుడికి భగవంతుడు అందని వాడు కాదు. భక్తుడికి భగవంతుడు స్నేహితుడు, మార్గదర్శకుడు. అందుకే 'దరస్ తేరె మాంగే, యె తెరా పూజారీ' అని ఫ్రెండు ఇంటికి వచ్చి బయటకు రమ్మని పిలిచినంత సులువుగా దర్శనం అడుగుతున్నాడు.

గీతోంకి ఫూలోంకి మాలా బనాకర్,
లాయా హూ ఆ దిల్ ఆర్తీ మే సజాకర్
యె సోసోం కి సర్‌గం, కరూ తేరె అర్పన్,
తుఝే ఔర్ క్యా దూ, మై తహరా భికారీ..

పాటను అనేక సాహిత్య అలంకారాలతో, భక్తి సంబంధిత భావాలతో నింపేశాడు శైలేంద్ర.

తన గీతాలను పూలుగా మలచి మాల తయారు చేసి, అతని హృదయాన్ని ఆరతిగా తీసుకువచ్చాడు. తన శ్వాసలోని సంగీతాన్ని ఆమెకు అర్పిస్తున్నాడు. ఆమెకు ఇంతకన్నా ఏమీ ఇవ్వలేడు, ఎందుకంటే, మిగతా అన్ని విషయాలలోనూ అతడు బికారీ.

సాధారణంగా దేవిని పూలతో అర్చిస్తారు. పూలమాల అర్పిస్తారు. ఇక్కడ ఇతడు గీతాల మాల అర్పిస్తున్నాడు. తన శ్వాసను సమర్పిస్తున్నాడు. ఉచ్వాస, నిశ్వాసాలను సంగీతంలో లయతో పోలుస్తారు. కానీ ఆ కదలికే వ్యక్తి ప్రాణం. అంటే, అతని జీవితాన్ని అస్తిత్వాన్ని సంపూర్ణంగా సమర్పిస్తున్నాడన్నమాట. హృదయాన్ని, శ్వాసను అర్పించటం అనేది మానసపూజ' క్రిందకు వస్తుంది.

రత్నై: కల్పితమాసనం హిమజలై: స్నానం చదిశ్యమంబరం
నానారత్న విభూషితం మృగమదామోదాంకితం చందనం!
జాతీ చంపక బిల్వపత్ర రచితం పుష్పం చ ధూపం తథా
దీపం దేవ దయానిధే పశుపతే హృత్కల్పితం గృహ్యతాం॥

ఇక్కడ శంకరాచార్యులవారు రత్నాలతో ఆసనం, హిమజలాలతో స్నానం, వంటివన్నీ కల్పితం.. 'హృత్కల్పితం గృహ్యతాం' పైన వర్ణించినవన్నీ మనసులో కల్పించి అర్పిస్తున్నామంటారు శంకరాచార్యులు. ఇక్కడ శైలేంద్ర ఆదేచేస్తున్నాడు. గీతాల కల్పన మనస్సులో జరుగుతుంది. ఆ గీతాలను పూలమాలగా అల్లి, శ్వాసను సంగీతంలా మలచి, హృదయాన్ని ఆరతిగా ఇస్తూన్నాడు.

'తుఝే ఔర్ క్యా దూ మై ఠహరా భికారీ ' అన్నది 'శరణాగతి 'లో 'ఆకించన్య??' భావం కిందకు వస్తుంది. అంటే తన దగ్గర ఏమీ లేదు, తానేమీ కాడు, తనను తాను సంపూర్ణంగా భగవంతుడికి అర్పించుకుని 'రక్షించమ 'ని వేడుకుంటున్నాడు.

అహం అస్సా పరాధానామవాలయో కించనోగతిః.

త్వమే వో పాయభూతో మే భవేతి ప్రార్థనా మతిః॥

నా దంటూ ఏమీ లేని బికారిని. నువ్వే నన్ను రక్షించాలి. ఇది శైలేంద్ర భావం. గమనిస్తే, ఈ విశ్వం అంతా భగవంతుడే ఐనప్పుడు, మనిషికి తనదీ అనేదేదీ వుండదు. అతని కళా శక్తి అతనిది. ఆ శక్తిని అందిస్తున్నాడు. ఆ శక్తితోనే ఆమెకే హారతి ఇస్తూన్నాడు.

ఆజా మధుర్ స్వప్న సీ ముస్కురాతీ

మన్ కీ బుఝే దీప్ హస్‌కర్ జలాతీ

జపే దిల్ కి ధడ్ కన్ తేరా నాం హర్ దం

ఉతర్ జ్యోతి కిరణోంకి లేకర్ సవారీ...

దేవిని ఆహ్వానిస్తున్నాడు. మధుర స్వప్నంలా నవ్వుతూ రమ్మంటున్నాడు. ఎందుకంటే ఆరిన మనస్సు దీపాలను వెలిగించేందుకు. అతని గుండె కొట్టుకునేదే ఆమె నామ జపంతో, అనుక్షణం దేవీ నామ జపం చేస్తున్నాడు. జ్యోతి కిరణాల ఆధారంగా దిగి రమ్మంటున్నాడు.' ఆమె అతని కోరిక మన్నించటం ఒక మధురమైన కల. ఆ కలలా నవ్వుతూ రమ్మంటున్నాడు. ఈ ఊహ అద్భుతంగా ఉంటుంది.

ఆకాశం నుంచి భూమికి అప్రతిహతంగా చేరేవి సూర్యకిరణాలు. వాటిని ఆధారం చేసుకుని, ఆ కిరణాల నుండి జాలు వారుతూ భూమికి దిగి రమ్మంటున్నాడు. 'తమసోమా జ్యోతిర్గమయా' 'చీకటి నుండి వెలుతురుకు. అతడి హృదయంలో దీపాలన్నీ ఆరిపోయాయి. చీకటి నిండింది. ఆ దీపాలను వెలిగించి వెలుతురులాంటి జ్ఞానాన్ని ఇమ్మంటున్నాడు. అదీ ఎలాగ, జ్యోతి కిరణాల ఆధారంగా దిగి వచ్చి.

ఇక్కడే మనకు సంత్ కబీర్, సురదాసులు గుర్తుకు వస్తారు. పాటలో పలు సందర్భాలలో శైలేంద్ర, కబీర్, సురదాసుల భావాల సారాన్ని తనదైన రీతిలో ప్రదర్శించాడు.

మన్ కర్ కటోరా, సీస్ కర్ థాలీ!

తహా అడ్సెప్ తీరభ్, ఆరతీ ఉతారీ॥

మనస్సును భిక్షగాని పాత్రలా చేసి, బుద్ధిని హారతి పళ్లెంగా మార్చి, నీ లోపల ఉన్న అది పవిత్ర తీర్థ స్థలాలను దర్శించి, హారతి అర్పించు.

'సాంసోకి సర్గం కరూతెరె అర్పణ్, తుఝే ఔర్ క్యాదూ మై ఠహరా భికారీ' లాంటివి కబీర్ భావాలకు సరళ రూపాలు. 'దిల్ ఆర్తీ ', 'శీస్ కర్ థాలీ ' దగ్గర సంబంధం కలిగి ఉన్నాయి

కబీర్ దీపక్ రియా తేలే అరి, బాతీ దఈ అఘుట్ట!

పూరా కియా బిసాహనా, బహూ ది న ఆవై హట్ట॥

దివ్య ప్రేమ అనే తైలంతో నిండిన దీపాన్ని నాకు అందించాడు. ఆ దీపం వత్తి ఎన్నటికీ కొండెక్కదు. దారిలో నిండిన చీకటి మాయమైపోయింది. దీపాన్ని నేను తిరిగి ఇవ్వనవసరంలేదు.

మన్ కే బుఝే దీప్ హస్కర్ జలాతీ '. ఆ దీపం వెలుగుతూండాలంటే, నిరంతరం ఆమె నామ జపం చేస్తూనే ఉండాలి. అప్పుడు జ్ఞానజ్యోతి కిరణాలతో జగతి ప్రకాశవంతమవుతుంది.

కబీర్‌లానే శైలేంద్ర దీపాన్ని చైతన్యానికి ప్రతీకలా వాడాడు. కబీర్ వాడిన 'దియా తేల్ భరీ ', 'బుఝే దీప్ హస్ కర్ జలాతీ ', ఒకే భావననిస్తాయి.

శైలేంద్ర 'హస్ కర్ జలాతీ' అనటం వెనుక సురదాస్ ప్రభావం ఉంది. ముందు చరణంలో తాను 'భికారీ'ని అన్నాడు. ఈ చరణంలో దీపం వెలిగించమంటున్నాడు.

'దుర్యోధన్ కీ మేవా త్యాగీ, సాగ్ విదుర్ ఘర్ ఖాయ్ ఈ' అంటాడు సురదాసు, భగవంతుడికి భక్తుడి భక్తితో సంబంధం తప్ప ఐశ్వర్యంతో కాదని నిరూపిస్తూ క్రుష్ణుడు, దుర్యోధనుడిచ్చిన పంచభక్ష్య పరమాన్నాలను కాదని, పేద విదురుడి ఇంటికి భోజనానికి సంతోషంగా వెళ్తాడు. అందుకే భికారీ హృదయ దీపాన్ని సంతోషంగా వెలిగించమని వేడుకుంటున్నాడు భక్తుడు.

ఈ భజన మరింత పవిత్రంగా, అద్భుతంగా హృదయలోతుల్లోకి జాలువారి స్థిరపడటంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది శంకర్ జై కిషన్ కూర్చిన సంగీతం. ఈ పాటను 'మియాకీమల్హార్' రాగంలో రూపొందించారు శంకర్ జైకిషన్. పాట ఆరంభంలోని ఆలాపనతోటే భక్తిభావన, అభ్యర్థన తీవ్రత, భక్తుడి దైన్యం, అభ్యర్థనలోని తీవ్రతలన్నీ అర్థమైపోతాయి. ఆరంభం మంద్రంగా అయినా, చరణం హై పిచ్‌కి వెళ్తుంది సాధారణంగా 'మియాకి మల్హార్ ' రాగంలోని గీతాలకు తాళం ఏక్తాళ్, కానీ తీన్ తాళ్ కానీ వాడతారు. కానీ శంకర్ జై కిషన్‌లు కెహెర్వాతాల్ వాడంతో పాటకు ఒక రకమైన వేగం, ఉద్వేగం అబ్బాయి. పాట పవిత్రత ప్రస్ఫుటమవుతుంది.

మన్నాడే పాటను పాడిన విధానం పాటలోని భావాలకు ప్రాణం పోస్తుంది. ముఖ్యంగా 'మీండ్'లు 'మూర్కీ'లు మల్హార్ రాగాన్ని అనుసరించి వేయటం పాట ప్రభావాన్ని పెంచుతుంది.

గగన్ తలక్ మై పలక్ పసారూం
ఏక్ ఝలక్ దిఖ్‌లాజా,
ముఝ్ పే తరస్ కర్ ఏక్ పల్ హస్,
జ్యోతి ధార్ బర్సాజా,
మేరీ లాజ్ తేరీ హాథ్ వరదే!

నా పరువు నీ చేతిలో ఉంది దేవీ! ఆకాశం వైపు కళ్లెత్తి చూస్తున్నాను ఆశగా. ఒక్క క్షణం దర్శనం ఇవ్వు. నాపై జాలి చూపి, ఒక్కసారి నవ్వి, భూమిపై జ్యోతి ధారలను కురిపించు. చివరలో పాట వేగవంతమౌతుంది. శైలేంద్ర పదాల పవిత్రత పెరుగుతుంది. మన్నాడే భక్త్యావేశం ఉవ్వెత్తున ఎగసిపడుతుంది.

ఇదీ 'బసంత్ బహార్' సినిమాలోని మరుపురాని భజన. కవి సంస్కారవంతుడయితే, ఒక క్లిష్టమైన సందర్భంలో ఎంతో లోతైన భక్తి భావాలను సరళంగా, పవిత్రంగా, సందర్భోచితంగా, తరతరాలు విని పాడుకుంటూ, అర్థం చేసుకుని భక్తి భావనల తరంగాల శృంగాలపై తేలియాడుతూ అనంతమైన విజ్ఞాన జ్యోతి ధారల ద్వారా వెలుగు వైపు ప్రయాణించగలిగే మాధ్యమంలా ఎదుగుతుంది కళ. అందుకు ఈ పాట చక్కని నిదర్శనంలా నిలుస్తుంది. కళా కారుడికి తన కళ భగవంతుడి వరం అనే అవగాహన ఉంటే, ఆ కళ ఇలా సదుపయోగమయి, తరతరాలను కాంతిమంతం చేస్తుంది.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story